నీటి ఎద్దడిని నివారిస్తాం

- తాగునీటి సమస్యల్లేకుండా చూస్తాం
- రాజాపురంలో అడ్డంకులు తొలగిస్తాం
- మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్‌రావు
- బోరు బావులు వేసేందుకు కసరత్తు
- 'నమస్తేతెలంగాణ' కథనంతో అధికారుల్లో కదలిక

అయిజ, ఫిబ్రవరి 27: జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం రాజాపురం గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి సమస్యల్లేకుండా చూస్తామని మిషన్ భగీరథ ఎస్ఈ జగన్మోహన్‌రావు తెలిపారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'చెంతనే తుంగభద్ర.. తీరని దాహం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఈఈ భీమేశ్వర్‌రావు, డీఈలు నాగరాజు, వెంకట్రామానాయక్, ఏఈలు జాకీర్ హుస్సేన్, రమేశ్‌తో కలిసి ఎస్ఈ జగన్మోహన్‌రావు గ్రామంలో పర్యటించారు. నీటి ఎద్దడిపై ఆరా తీశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో రాజాపురం గ్రామం చివరన ఉన్నదని, పైప్‌లైన్‌లో నీటి లభ్యత తగ్గుతుండటంతో ట్యాంక్‌లు నిండలేదని, ఫలితంగా నీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామస్తులు అధికారులకు వివరించారు. గ్రామంలో ఎన్ని బోర్లు వేసినా ఫలితం లేకపోవడంతో 20 రోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి లోకేశ్, స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్‌తోపాటు పులికల్, బైనపల్లి, కొత్తపల్లిలోని 4ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో శిథిలమైన బోర్లు, పురాతన బావిని సందర్శించారు. బోర్లఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూములను పరిశీలించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తామని ఎస్ఈ తెలిపారు. బోరు బావులు తవ్వి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీటి ఎద్దడి సమస్యపై కథనం ప్రచురించిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

జోగుళాంబ గద్వాల జిల్లా రాజాపురంలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తున్న ఎస్ఈ జగన్మోహన్‌రావు

నీటి సమస్యను పరిష్కరిస్తాం

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వెల్లడి • నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నార్నూర్, ఫిబ్రవరి 27 : తాగు నీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం భీంపూర్ పంచాయతీ పరిధిలోని బొజ్జు కొలాంగూడ నెలకొన్న నీటి సమస్యపై 'గిరిజనుల తాగు నీటి తంటాలు' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' మెయిన్ పేజీలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆదేశాలతో అధికారులు బొజ్జు కొలాంగూడ గ్రామానికి వెళ్లారు. కొలాం గిరిజనులు తాగునీటి కోసం ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. తాగునీటి సమస్య పరిష్కారానికి నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని, త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఏఈ సుభానీ, నాయకులు దిలీప్ ఉన్నారు.

బొజ్జు కొలాంగూడలో వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ధాన్యం దొంగలు దొరికారు

- ఏడుగురి అరెస్టు, రిమాండ్
- పరారీలో మరో ఆరుగురు
- మాయమైంది 13 వేల బస్తాలేనట
- వెల్లడించిన పోలీసులు

వనపర్తి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ధాన్యం దొంగలు దొరికారు. వనపర్తి జిల్లా చిన్నంబాయి మండలం పెద్దదగడలోని ప్రభుత్వ గోడౌన్ నుంచి అర్ధరాత్రి ధాన్యం బస్తాలను దొంగిలించిన ముఠా ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. ఈ విషయమై నమస్తే తెలంగాణ దినపత్రిక గత మూడు రోజులుగా కథనాలు ప్రచురించింది. స్పందించిన పోలీసులు అత్యంత గోప్యంగా పోలీసులు విచారణ జరిపారు. వనపర్తి సీఐ నాగభూషణ్‌రావు కథనం మేరకు.. పెద్దగడలో ధాన్యం బస్తాలను ఎత్తుకెళ్లిన సంఘటన తెల్సిందే. విచారణ అనంతరం మొత్తం 13 మందిని నిందితులుగా గుర్తించి 13 వేల ధాన్యం బస్తాలు చోరీకి గురైనట్టు తేల్చారు. ఈ మేరకు చిన్నంబాయి ఎస్సై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఏడుగురిని పెద్దకొత్తపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. వీరిలో ఏ-1 బిలకంటి మౌనిష్ అలియాస్ మనీ (పెద్దకార్పాముల), ఏ-2 ఎండీ మహమూద్ (పెద్దకార్పాముల), ఏ-3 శ్రీనివాసులు (వనపట్ల), ఏ-4 బాలపీరు (పెద్దకొత్తపల్లి), ఏ-5 శివశంకర్ (సాతాపూర్), ఏ-6 సాయికుమార్ (పెద్దకార్పాముల), ఏ-7 బాలరాజు (పెద్దకొత్తపల్లి) ఉన్నారు. మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు. ఇదిలావుంటే ధాన్యాన్ని ప్రభుత్వ గోడౌన్ నుంచి కొందరు వ్యక్తులు దర్జాగా తరలించుకుపోతే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం గమనార్హం. పొద్దుపోయిన తరువాత ఓ మెసేజ్ ద్వారా సమాచారం ఇవ్వడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

మాజీ ఎమ్మెల్యే తండ్రి నేత్రాలు దానం

- అనారోగ్యంతో కోరుకంటి మల్లయ్య మృతి

గోదావరిఖని, ఫిబ్రవరి 27: పెద్దపల్లి జిల్లా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తండ్రి మల్లయ్య (82) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. గోదావరిఖనిలో నివాసముంటున్న ఆయన గతంలో సింగరేణిలో పనిచేసి రిటైర్ అయ్యారు. పుట్టెడు దు:ఖంలోనూ మాజీ ఎమ్మెల్యే చందర్ మరో ఇద్దరికి వెలుగులు ప్రసాదించడానికి తన తండ్రి నేత్రాలు దానం చేయడానికి ముందుకొచ్చారు. లయన్స్‌క్లబ్, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్.. మల్లయ్య నేత్రాలను సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. ఈ సందర్భంగా చందర్‌ను పలువురు అభినందించారు.


కృష్ణమూర్తి సహచర ఉద్యోగులకు నగదు అందజేస్తున్న సిబ్బంది

నిజాయితీ చాటుకున్న అంబులెన్స్ సిబ్బంది

మహ్మదాబాద్, ఫిబ్రవరి 27: కృష్ణమూర్తి అనే పోస్టల్ ఉద్యోగి మంగళవారం మహబూబ్‌నగర్ హెడ్ పోస్టాఫీస్ నుంచి రూ.10 లక్షల నగదును బైక్‌పై తీసుకెళ్తుండగా, మహ్మదాబాద్ మండలం నంచర్ల వద్ద బైక్ అదుపు తప్పి కింద పడటంతో అతడికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యంకోసం మహబూబ్‌నగర్ తరలించారు. అతడి వద్ద ఉన్న 10 లక్షలను ఈఎంటీ లక్ష్మీనారాయణ, పైలట్ చాంద్ పాషా కృష్ణమూర్తి తోటి ఉద్యోగులకు అందజేశారు.

సాంచా సంక్షోభం

- వస్త్ర ఆర్డర్లు ఇవ్వని కొత్త సర్కారు
- ఉపాధి లేక రోడ్డున పడ్డ నేతన్నలు
- నేడు సిరిసిల్లలో కార్మికుల మహాధర్నా

వస్త్ర ఉత్పత్తులు లేక ఖాళీగా ఉన్న సాంచాలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): ఆర్థిక మాంద్యంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నిలిచి పోయింది. ఉత్పత్తి చేసిన పాలిస్టర్ వస్త్రాలకు గిరాకీ లేక లక్షల మీటర్ల నిల్వలు పేరుకుపోయాయి. దీంతో మరమగ్గాలను బంద్ పెట్టడం అనివార్యమైంది. ఒక వైపు మార్కెట్‌లో గతంలో విక్రయించిన వస్త్రాలకు సంబంధించిన పైసలు రాక యజమానులు ఇబ్బందులు పడుతుంటే.. మరో వైపు పనిలేక నేత కార్మికులు, ఆసాములు అన్నమో రామచంద్రా అంటూ అలమటిస్తున్నారు. మార్కెట్‌లో పోటీని తట్టుకునే పరిస్థితి లేక సంక్షోభంలో కూరుకుపోయిన పరిశ్రమను ఆదుకునేందుకు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్‌వీఎం, క్రిస్మస్, రంజాన్, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి అండగా నిలిచింది. రెండున్నర నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఆర్డర్లు ఇవ్వలేదు. ఇస్తుందా? లేదా? అన్నది కూడా స్పష్టత లేకపోవడంతో యజమానులు సాంచాలు నడపడం సాధ్యం కాదంటున్నారు. గత ప్రభుత్వంలో పదేండ్లపాటు ఎలాంటి సంక్షోభం లేకుండా నడిచిన వస్త్ర పరిశ్రమకు.. కొత్త ప్రభుత్వంలో ఇబ్బందులు తప్పవా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బతుకమ్మ చీరల తయారీకి సంబంధించి టెస్కో సంస్థ రూ.250 కోట్ల వరకు వస్త్ర పరిశ్రమకు బకాయి పడింది. అవి ఇంకా విడుదల కాకపోవడంతో యజమానులు, ఆసాములు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వస్త్ర పరిశ్రమపై పరోక్షంగా, ప్రత్యక్షంగా ఇరవై వేలమందికి పైగా ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. ఏటా బతుకమ్మ చీరల ఆర్డర్లకు సంబంధించి జీవోను ఫిబ్రవరి మాసంలో టెస్కో అధికారులు విడుదల చేస్తారు. ప్రభుత్వం మారడంతో ఇప్పటి వరకు అలాంటి ఊసే లేదని, వస్త్ర పరిశ్రమ బకాయిల గురించి అంతకన్నా మాట్లాడటం లేదని నేతన్నలు వాపోతున్నారు.

కేసీఆర్ సారుంటే ఇంత తిప్పలు గాకుండె

మాది తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి. నేను రోజూ సద్ది కట్టుకుని సిరిసిల్లకు వచ్చి సాంచాలు నడిపిన. భీములు, కోములు లేక సాంచాలు నడవక రెండు నెలలైతాంది. కేసీఆర్ సార్ ఉన్నపుడు బతుకమ్మ చీరలు ఇచ్చిండు. అప్పుడు వెయ్యి కూలి దొరికింది. నెలకు 20 వేలు సంపాదించిన. కొత్త సర్కారు వచ్చినంక పనిపోయింది. పాలిస్టర్‌కు గిరాకీ లేదని సేట్లు సాంచాలు బంద్‌పెట్టిండ్రు. కొత్త సర్కారు బతుకమ్మ ఆర్డర్లు, పాత బకాయిలిస్తేనే నడుపుతమంటున్నరు. పొట్టకు బాగా తిప్పలైతాంది. 5 అన్నపూర్ణ భోజనం తిని కాలం గడుపుతున్న.

- మ్యాన లస్మయ్య, మరమగ్గాల కార్మికుడు, బద్దెనపల్లి, తంగళ్లపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా

తక్షణం ప్రతి కార్మికుడికి 15 వేలు ఇవ్వాలి

సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని దృష్టి లో పెట్టుకుని కేసీఆర్ ప్రభుత్వం అనేక ఆర్డర్లు ఇచ్చింది. ఇచ్చిన ఆర్డర్లతో నేతన్నలకు మంచి గిట్టుబాటు కూలీతో చేతినిండా పనిదొరికింది. వలస వచ్చి ఇక్కడ బతుకుతున్నారు. కొత్త ప్రభుత్వం ఆర్డర్లు ఇస్తుందా? లేదా? అన్నది స్పష్టత లేదు. బతుకమ్మ చీరల పెండింగ్ బకాయిల గురించి ఉలుకూ పలుకూ లేదు. పరిశ్రమ బంద్ వల్ల ఉపాధి కోల్పోయిన ప్రతి కార్మికుడికి తక్షణ సాయంగా రూ.15 వేలు ఆర్థిక సహాయం ప్రభుత్వం అందించాలి.

-ఉడుత రవి, సీఐటీయూ, తెలంగాణ పవర్ లూమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు

వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నం

తయారైన పాలిస్టర్ వస్త్రాలకు మార్కెట్‌లో గిరాకీ లేదు. మీటరుకు రూపాయి నష్టం వస్తంది. రూ.20 కోట్ల విలువైన వస్త్రాలు అమ్ముడుపోక నిల్వ ఉన్నది. బతుకమ్మ చీరల తయారీకి సంబంధించి సర్కారు రూ.250 కోట్లు ఇవ్వాలి. మంత్రులను కలిశాం. ఇస్తామని హామీ ఇచ్చారు. చుట్టూ తిప్పుకుంటున్నరు. కానీ, ఇవ్వడం లేదు. పెట్టిన పెట్టుబడికి వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నం. సర్కారు పెండింగ్ బకాయిలు ఇస్తేనే సాంచాలు నడిపే పరిస్థితి ఉంది. సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలుంటే అందులో సగం బంద్‌పెట్టినం.

-మండల సత్యం, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు

17 వరకే కాంగ్రెస్‌కు డెడ్‌లైన్

420 హామీలపై వెంటాడి వేటాడుతాం

హామీలు నెరవేర్చకపోతే బొంద పెట్టాల్సిందే

- కోతలు పెడుతున్న రేవంత్‌రెడ్డి తోకను ప్రజలు కత్తిరించడం ఖాయం
- కాంగ్రెస్‌లో ఎవరి దుకాణం వారిదే
- కేసీఆర్ గొప్పదనం తెలుస్తున్నది
- హైదరాబాదీల రుణం తీర్చుకోలేం
- అంబర్‌పేట, ఇబ్రహీంపట్నం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో/ రంగారెడ్డి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను మార్చి 17లోగా నెరవేర్చకపోతే ఆ పార్టీని బొంద పెట్టాల్సిందేనని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలను ఆమలు చేసేదాకా వెంటాడి, వేటాడుతామని హెచ్చరించారు. మంగళవారం ఆయన అంబర్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల ముందు అందరికీ ఇస్తామని చెప్పి, ఇప్పుడు కొందరికే అంటున్నారని విమర్శించారు. రేషన్ కార్డు లేకున్నా, బైక్ ఉన్నా వారికి పథకాలు రావని కోతలు పెడుతున్న రేవంత్‌రెడ్డి తోకను ప్రజలే కత్తిరిస్తారని హెచ్చరించారు. రాష్ట్రంలోని 1.34 కోట్ల మందికి 200 యూనిట్ల కరెంటు, 1.24 కోట్ల మందికి రూ.500కే గ్యాస్ ఇచ్చి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో ఎవరికి వారే ముఖ్యమంత్రిలా తయారయ్యారని ఎద్దేవా చేశారు. ఎవరి దుకాణం వాళ్లు తెరిచారని, కోమటిరెడ్డిది ఒక దుకాణమైతే రేవంత్‌రెడ్డిది మరో దుకాణమని విమర్శించారు. ఆరు నుంచి తొమ్మిది నెలల్లో వాళ్లలో వాళ్లే తన్నుకు చస్తారని, కాంగ్రెస్ పార్టీ నైజం అదేనని చెప్పారు.

గుంపు మేస్త్రీ పాలనతో కేసీఆర్ గొప్పదనం తెలుస్తది

గుంపు మేస్త్రీ పాలన చూస్తేనే ప్రజలకు అనుభవపూర్వకంగా కేసీఆర్ గొప్పదనం తెలుస్తున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. కరెంటు పోతే ప్రజలు కేసీఆర్‌నే గుర్తుకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డిని చూసి 'గీననా.. సీఎం' అని ప్రజలు అనుకుంటున్నారని, ఆయన మాటలు ఎవరికీ నమ్మబుద్ధి కావడంలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ప్రాజెక్టులపై ఆ పార్టీ వైఖరిని ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 90% పనులను బీఆర్‌ఎస్ హయాంలో పూర్తి చేశామని, కేవలం కాలువలు తవ్వితే నీరు ఇవ్వొచ్చని, ఆ తెలివి కూడా కాంగ్రెస్సోళ్లకు లేదని విమర్శించారు.

హైదరాబాద్ ప్రజల రుణం తీర్చుకోలేం

హైదరాబాద్ వాసులు బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి అక్కున చేర్చుకున్నారని వారి రుణం తీర్చుకోలేనిదని కేటీఆర్ పేర్కొన్నారు. ఇక్కడి కార్యకర్తలు కష్టపడి 16 సీట్లు సాధించారని, ఇదే స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చైతన్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ఉద్యమస్ఫూర్తిని మరోసారి చాటాలని పిలుపునిచ్చారు.

కిషన్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్

ఐదేండ్లుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ర్టానికి ఒక్క పైసా తెలేదని కేటీఆర్ విమర్శించారు. కరోనా వస్తే కుర్‌కురే ప్యాకెట్లు పంచడం తప్ప కిషన్‌రెడ్డి చేసిందేమీ లేదని ఎద్దేవాచేశారు. గత పదేండ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 36 ప్రాజెక్టులు చేపట్టిందని, అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబర్‌పేట, ఉప్పల్ ఫ్లైఓవర్లు పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. బీజేపీకి, బీఆర్‌ఎస్‌కీ తేడా ఇదేనని వివరించారు.

భువనగిరి, సికింద్రాబాద్ గెలుపునకు కసితో పనిచేయాలి

భువనగిరి, సికింద్రాబాద్ ఎంపీ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కసితో పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని, పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటయ్యాయని వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బీ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, అరికపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, అరికెపూడి గాంధీ, బీ లక్ష్మారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, బీఆర్‌ఎస్ నేతలు గంధ్ర వెంకటరమణారెడ్డి, తలసాని సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చలో మేడిగడ్డ

▶ మొదటిపేజీ తరువాయి...

బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిన్నెగా మార్చిందని తెలిపారు. నేడు తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా మారిందని చెప్పారు. ధాన్యం ఉత్పత్తి 24 లక్షల టన్నుల నుంచి మూడున్న కోట్ల టన్నులకు పెరిగింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. గతంలో ఎకరం భూమి రూ.3 లక్షలు ఉంటే, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఇప్పుడు అది 30 లక్షలకు చేరిన మాట నిజం కాదా? అని నిలదీశారు.

మార్చి ఒకటిన మేడిగడ్డ సందర్శన

మార్చి ఒకటోతేదీన మేడిగడ్డ బరాజ్‌ను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల బృందం సందర్శిస్తుందని కేటీఆర్ ప్రకటించారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో కలిసి సందర్శనకు వెళ్తామని తెలిపారు. '150 మందితో మేడిగడ్డకు వెళ్తాం. మీడియా బృందాన్ని కూడా తీసుకెళ్తాం. దశలవారీగా అన్ని బరాజ్‌లు, పంపుహౌస్‌లు సందర్శిస్తాం. మాతో కాంగ్రెస్ మంత్రులు వస్తామంటే వెంట తీసుకెళ్తాం. ప్రజలకు కాళేశ్వరం ద్వారా అందుతున్న ఫలాలను వివరిస్తాం. మేడిగడ్డపై కాంగ్రెస్ పార్టీ కుట్రలను ఎండగడుతాం. మేడిగడ్డలో రెండుమూడు పిల్లర్లకు పగుళ్లు వస్తే బరాజ్ మొత్తం కూలిపోయిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ బరాజ్ ఒక్కటే కాదు. కాంగ్రెస్ హయాంలో కడెం ప్రాజెక్టు, గుండ్లవాగు, మూసీ ప్రాజెక్ట్, సింగూరు, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ వంటి అనేక ప్రాజెక్టుల్లో సమస్యలు వచ్చాయి. వాటిని తిరిగి మరమ్మతులు చేసి ప్రజలకు ఉపయోగపడేలా మార్చారు. ఒక కాఫర్ డ్యాంని నిర్మించి మూడు పిల్లర్లకు వెంటనే మరమత్తులు నిర్వహించవచ్చు. రాజకీయంగా మాపై కోపం ఉంటే తీర్చుకోండి. రైతులను, ప్రజలను మాత్రం ఇబ్బందిపెట్టొద్దు. మేడిగడ్డపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవచ్చు. ఇదే విషయాన్ని అసెంబ్లీలో కూడా చెప్పాం. దేశంలో అనేక ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టారు' అని కేటీఆర్ పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద ఇప్పటికీ 5 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళ్తున్నదని చెప్పారు.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణను కన్నీళ్లు పెట్టించిన కాంగ్రెస్

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు కన్నీళ్లు మిగిల్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేటీఆర్ విమర్శించారు. నదీజలాల కోసం తెలంగాణ ప్రజలు దశాబ్దాల పాటు పోరాడారని, బాసర నుంచి భద్రాచలం దాకా పారుతున్న గోదారి జలాల కోసం ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఎన్ని ఉద్యమాలు చేసినా గోదావరి నీళ్లను తెలంగాణకు అందించకుండా 60 ఏండ్లపాటు కాంగ్రెస్ పార్టీ కన్నీళ్లు మిగిల్చిందని గద్దర్, సదాశివుడు లాంటి కళాకారులు ప్రజలకు వివరించి చెప్పారని అన్నారు. కేసీఆర్ జలసాధన పోరాటంతో ప్రతి మండలంలో బ్రిగేడియర్లను నియమించి రైతులను జాగృతం చేశారని తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం గోదావరిపై బాబ్లీ ప్రాజెక్టు కట్టినా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూసిందని విమర్శించారు. కొత్త ప్రాజెక్టులు కట్టకపోగా ఎస్సారెస్పీ ఎండిపోయేలా చేసిందని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభంకాగానే ప్రాణహిత చేవెళ్ల అంటూ రంగుల కల చూపించారని, కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ జలయజ్ఞం పేరుతో నాటకాలకు తెరలేపిందని దుయ్యబట్టారు. ఒక్క కాల్వ కూడా తవ్వకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరుతో అడ్డగోలుగా నిధులు దోచిపెట్టారని విమర్శించారు. ఆనాటి జలయజ్ఞంలో రూ.52 వేల కోట్ల అవినీతి జరిగిందని కాగ్ రిపోర్ట్ ఎండగట్టిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ గొప్పగా చెప్పుకొంటున్న కాగ్ రిపోర్టులను కాంగ్రెస్ పార్టీ ప్రధాని మన్మోహన్‌సింగ్ నుంచి మొదలుకొని ఆనాటి కాంగ్రెస్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి దాకా అందరూ తప్పుపట్టారని కేటీఆర్ గుర్తుచేశారు. మరి కాగ్ రిపోర్టు నాడు తప్పు అయితే నేడు ఎలా ఒప్పు అవుతుందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

మీరెందుకు అప్పులు చేస్తున్నారు?

రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా మాట్లాడుతున్నదని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎంకు, కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కొత్తగా అప్పులు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నడిపించాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు విధించిన వందరోజులు గడువు ముగుస్తున్నదని, ఆ హామీలను నిలుపుకునే పరిస్థితి లేక బుకాయించడానికి ప్రభుత్వం చూస్తున్నదని విమర్శించారు.

కాళేశ్వరం అంటే ఒక్క బరాజ్ కాదు

గోదావరి నీళ్లను తెలంగాణ పొలాలకు మళ్లించాలన్న సంకల్పంతో ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరంగా మార్చి కేసీఆర్ మహా ప్రాజెక్టుగా నిర్మించారని కేటీఆర్ తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద సరిపడా నీటి లభ్యత లేదని సెంట్రల్ వాటర్ కమిషన్ తేల్చిన తర్వాతనే నిపుణుల సలహాలతో మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. కాలంతో పోటీపడి కాళేశ్వరం కట్టిన ఘనత కేసీఆర్‌ది అని ఆయన అన్నారు. 'కాళేశ్వరం అంటే మేడిగడ్డ మాత్రమే అన్నట్టుగా మాట్లాడుతున్నారు. కాళేశ్వరం అంటే 3 బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌజ్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల కాల్వలు, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజీ కెపాసిటీ, 240 టీఎంసీల వినియోగం.. వీటన్నింటి సమాహారమే కాళేశ్వరం ప్రాజెక్టు. లక్ష కోట్లు కొట్టుకుపోయాయని ఒకవైపు చెప్తూ, రూ.3,500 కోట్ల బారాజ్‌ను.. అందులో కూడా 84 పిల్లర్లుంటే 3 పిల్లర్లు దెబ్బతింటే మొత్తం బరాజ్ కొట్టుకపోయిందనే విధంగా చిత్రీకరిస్తున్నారు. 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే కామధేనువు కాళేశ్వరం. 88 మీటర్ల ఎత్తు నుంచి 618 మీటర్లు ఎత్తుకు గోదావరి గంగ ఎగిసిదుంకే జలదృశ్యాన్ని ఆవిష్కరించాం. తెలంగాణను కరువు నుంచి గట్టెక్కించే కామధేనువు కాళేశ్వరం' అని పేర్కొన్నారు.

ప్రతి జల విజయం కాళేశ్వరంతోనే..

తెలంగాణ ఉద్యమానికి జడిసి నాడు ఆదరాబాదరాగా ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును 16.4 టీఎంసీలతో రిజర్వాయర్లు లేకుండా డి జైన్ చేశారని, కానీ కాళేశ్వరంలో 141 టీఎంసీల రిజర్వాయర్లను నిర్మించామని కేటీఆర్ తెలిపారు. 'కాళేశ్వరం ద్వారా కొత్త ఆయకట్టు, స్థిరీకరించిన ఆయకట్టు కలిపి 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చేలా నిర్మించాం. 139 మెగావాట్ల సామర్థ్యంగల మోటర్లను పెట్టి నీటిని ఎత్తిపోసేలా చేశాం. కాళేశ్వరంలో నీటిని మేడిగడ్డ నుంచే ఎత్తిపోయాల్సిన అవసరంలేదు. ఎల్లంపల్లి, ఎస్సారెస్పీ, వరదకాల్వ, మిడ్‌మానేరు నుంచి కూడా ఎత్తిపోయొచ్చు. హైదరాబాద్ నగరం మంచినీటికి ఇబ్బంది పడొద్దని కాళేశ్వరం నిర్మించాం. కాకతీయ కాల్వ 6 నెలలపాటు ఆరకుండా చివరి మడిని కూడా తడిపింది కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే. ఈ విషయం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కూడా తెలుసు. కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి, మహబూబాబాద్, డోర్నకల్ వరకు నీళ్లు వచ్చాయంటే కాళేశ్వరం వల్లనే. కాళేశ్వరం ద్వారా చెరువులు నింపుకున్నాం. జల విజయాలన్నీ కాళేశ్వరం పుణ్యమే. సిరిసిల్ల జిల్లాలో ఆరు మీటర్ల మేర భూగర్భ జలాలు పైకి వచ్చాయి. కాళేశ్వరం వల్ల పాతాళగంగ పైకి వచ్చింది' అని వివరించారు. ముషంపల్లిలో బోర్ల రాంరెడ్డి 54 బోర్లకు పెట్టిన ఖర్చును ఎవరి ఖాతాలో వేస్తారని నిలదీశారు. కాస్ట్ బెనిఫిట్‌ను లెక్కలోకి తీసుకుంటే ప్రభుత్వ దవాఖానలు, ఐఐటీ, ఐఐఎం, ఆర్ఈసీలు కట్టకూడదని అన్నారు. తెలంగాణలో రైతులకు నీళ్లు ఉంటే వరిపంటే వేస్తారని, నీళ్లు లేకుంటేనే ఇతర పంటలు వేస్తారని తెలిపారు. రైతు బిడ్డను అని చెప్పుకునే సీఎంకు ఈ విషయం తెలియడంలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, దానం నాగేందర్, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గంధ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

మరిన్ని వార్తలకు www.ntnews.com చూడండి

INNOWIS IAS
TSPSC GROUP-1
FREE COACHING EWS, SC, ST STUDENTS
EXCLUSIVE PRELIMS BATCH E/M STARTS ON 11.03.2024 @ 10 AM
INTER + CLAT /IPM / CUET
DEGREE + IAS (COURSES OFFERED)
PRATHIBHA DEGREE & P.G.COLLEGES
KUKATPALLY, HYD. Ph: 7374837937

TATA INSTITUTE OF FUNDAMENTAL RESEARCH
(Autonomous Institution of the Department of Atomic Energy, Government of India)
Survey No.36/P, Gopanpally Village, Serilingampally Mandal, Ranga Reddy District, Hyderabad 500046 Ph: 040-20203040 Website: www.tifrh.res.in
Advertisement No. 2024/02
Online applications are invited for following position at Extreme Photonics Innovation Centre (EPIC), jointly established between UK's Central Laser Facility (CLF) and India's Tata Institute of Fundamental Research (TIFR) to develop the control systems for the next-generation high powered laser accelerators. For more details please visit https://recruitment.tifrh.res.in/applicants/

S.No	Name of the Post	UR	SC	ST	OBC	PwBD	EWS	Age Below	TME
1.	Project Scientific Officer (D) Under 'EPIC Project'	1	-	-	-	-	-	45years as on Jan 01, 2024	Rs. 1,17,100/- Consolidated Pay (Including HRA of Rs. 18,451/-).

Last date to apply online : 19th March 2024. Applications are received through online link https://recruitment.tifrh.res.in/applicants/ only.
Sd/- Administrative Officer

CSIR-CENTRAL FOOD TECHNOLOGICAL RESEARCH INSTITUTE
RESOURCE CENTRE, HYDERABAD-500 007
announces
Hands on Training Programme
on
VALUE ADDED PRODUCTS FROM MINOR MILLETS
(Under the sponsorship of Khadi and Village Industries Commission (KVIC), Mumbai)
Applications are invited from interested candidates for a Hands on Training Programme on value added products from minor millets to enhance the entrepreneur's skills in processing minor millets. Degree/Diploma holders are eligible to apply. There is no course fee. The training programme will be held at CSIR-CFTRI Resource Centre, Habshiguda, (Opp to Metro pillar C-968) Hyderabad during 25-28 March 2024. No. of participants is limited to 15 only. Selected candidates have to make their own arrangements for travel & accommodation during the programme.
Applications with details of qualifications, age, experience (if any) and contact details, along with entrepreneurship details (if any) may be mailed to rchyderabad@cftri.res.in or sathiyamala@cftri.res.in on or before 10.03.2024. Shortlisting of candidates will be carried out by a screening committee. The decision of the screening committee is final and binding. Interested Candidates may contact Mrs. K. Sathiya Mala: 9246356615; Mr. A. Nagender: 9440544676